క్లుప్తంగా

ఆధార్ అప్‌డేట్ చేసుకోండి

సుభాష్‌నగర్: ఆధార్‌కార్డ్ తీసుకుని 10 సంవత్సరాలు పూర్తయిన ప్రతి ఒక్కరూ తమ వివరాలను అప్‌డేట్ చేసుకోవాలని మీసేవ సంఘం జిల్లా అధ్యక్షుడు కొత్తపల్లి దయాసాగర్ గుప్తా ఓ ప్రకటన తెలిపారు. 2015 అంటే ముందు ఆధార్ పొందిన వారు పదోతరగతి మెమో, పాన్ కార్డు, ఓటర్ గుర్తింపు కార్డు, పాస్‌పోర్టులలో ఏదో ఒకటి జతపరిచి అప్‌డేట్ చేసుకోవాలన్నారు. ఇందుకుగాను సూరారంలోని కుత్బుల్లాపూర్ తహసీల్దార్ కార్యాలయంలో శని, ఆదివారాల్లో ప్రత్యేక క్యాంపు ఉంటుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఇతర వివరాలకు ఫోన్ నం.9397012873లో సంప్రదించాలని కోరారు.

చెరువులో వ్యక్తి మృతదేహం లభ్యం



దుండిగల్: ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో చెరువులో శవమై తేలిన ఘటన దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుండిగల్‌కు చెందిన జీతయ్య(40) స్థానికంగా ఓ ప్రైవేట్ పరిశ్రమలో పని చేస్తున్నాడు. కాగా శుక్రవారం సాయంత్రం 4గంటలకు గాగిల్లాపూర్ చెరువులో గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం తేలింది. స్థానికుల ద్వారా సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని పరిశీలించగా జీతయ్యగా గుర్తించారు. అయితే గురువారం రోజే చెరువులో పడి ఉంటాడని అనుమానిస్తున్నారు. చేపలు పట్టేందుకు వెళ్లాడా.. లేదా బహిర్భూమికి వెళ్లి ప్రమాదవశాత్తు చెరువు లో పడి మునిగిపోయాడా అని పోలీసులు పేర్కొంటున్నారు. ఈ మేరకు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించిన పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

బీవీఆర్ఐటీలో 'మేధాన్వేష్'



నిజాంపేట్: బాచుపల్లిలోని బీవీఆర్ఐటీ మహిళా ఇంజినీరింగ్ కళాశాలలో శుక్రవారం జాతీయ స్థాయి విద్యార్థుల సాంకేతిక ఉత్సవం 'మేధాన్వేష్–2023'ఘనంగా ప్రారంభమైంది. డైరెక్టర్ ఆఫ్ ఇంజినీరింగ్, ఎక్స్‌పీరియన్స్ సృజన శ్రీవాస్తవ, ఐఐటీ హైదరాబాద్ ఆచార్యులు డాక్టర్ నిమ్మీ రంగస్వామిలు ముఖ్య అతిథులుగా హాజరై విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. దేశ వ్యాప్తంగా నేడు అనేక రంగాల్లో మహిళల ప్రాతినిధ్యం పెరిగిందన్నారు. సాంకేతికతను ఉపయోగించుకుని అవకాశాలను అందిపుచ్చుకోవాలని సూచించారు.

◆ అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కేవీఎస్ సునీత మాట్లాడుతూ... విద్యార్థులు తమ సాంకేతిక నైపుణ్యాలను ప్రదర్శించడానికి ప్రతి ఏటా మేధాన్వేష్‌ను నిర్వహిస్తున్నామని అన్నారు. గెలుపోటములకు సంబంధం లేకుండా ప్రతి ఒక్కరూ ఉత్సాహంగా పాల్గొనాలని కోరారు. రెండు రోజుల పాటు జరిగే ఈ మేధాన్వేష్‌లో జరిగే విభిన్న సాంకేతిక పోటీల గురించి మేధాన్వేష్ కన్వీనర్ డాక్టర్ అన్వర్ బాషా పఠాన్ వివరించారు. ఈ కార్యక్రమంలో వివిధ విభాగాల అధిపతులు, అధ్యాపక బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

జూదరుల అరెస్టు

నిజాంపేట్: నిజాంపేట్ జయలక్ష్మి అపార్ట్‌మెంట్‌లో పేకాడుతున్న 14 మందిని బాలానగర్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. వీరి వద్ద నుంచి రూ.48వేలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. అనంతరం బాచుపల్లి పోలీస్‌స్టేషన్‌లో నిందుతులను అప్పగించారు. ఈ మేరకు బాచుపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ఒకే రసం.. ఆలోచనలు వినూత్నం



వాహనంపై వీధుల్లో తిరుగుతూ వ్యాపారం

వినియోగదారులను ఆకర్షించేందుకు చిరు వ్యాపారులు వినూత్నంగా ఆలోచిస్తున్నారు. ఒకే రకం జ్యూస్‌ని వివిధ రకాల మెషిన్లలో తీసి విక్రయిస్తున్నారు. ఒకటి కరెంట్‌తో నడిచే మెషిన్ అయితే మరొకటి చేతితో నడిచే మెషిన్. ఇంకొకటి ఉంది. అదేంటంటే.. రసం తీసే మెషిన్‌తో పాటు నడుపుకుంటూ వెళ్లే బండ్లను తయారు చేయించుకుంటున్నారు. నేరుగా గల్లీలు, బస్తీలు, కాలనీల్లోని ఇళ్ల వద్దకే వెళ్లి చెరుకు రసం అమ్ముతున్నారు. పళ్ల రసాలకు ఇది మంచి సీజన్ కావడంతో ఇలా ఒక్కక్కోరు ఒకోలా చెరుకు రసాన్ని తీసి నాలుగు రాళ్లు వెనకేసుకుంటున్నారు.

– జగద్గిరిగుట్ట





యంత్రాల సహాయంతో చెరుకు రసం తీస్తూ..

ట్రాఫిక్ రూల్స్ పాటించరా?





జగద్గిరిగుట్ట లాస్ట్‌బస్టాప్ సమీపంలో బొలార్డ్స్ మధ్యలోంచి వెళ్తున్న ఆటో

డివిజన్ పరిలోని జగద్గిరిగుట్ట బస్టాప్ సమీపంలో ఇందిరమ్మ విగ్రహం వద్ద ఆటోవాలాలు ట్రాఫిక్ రూల్స్ తమకు కావు అన్నట్లుగా వ్యవహరిస్తున్నారు. ఈ ప్రాంతంలో నిత్యం ట్రాఫిక్ జామ్ అవుతున్న నేపథ్యంలో పోలీసులు రోడ్డు మధ్యలో బొలార్డ్స్ ఏర్పాటు చేశారు. కానీ ఆటోవాలాలు బొలార్డ్స్ మధ్య నుంచి ఇష్టం వచ్చినట్లు వెళ్తున్నారు. ఇతర వాహనాల రాకపోకలకు ఆటంక సృష్టిస్తున్నారు. ఇప్పటికైనా ట్రాఫిక్ పోలీసులు వీరి ఆగడాలను అడ్డుకోవాలని కోరుతున్నారు. ప్రమాదాలు కూడా జరిగే ఆస్కారం ఉంది.

– జగద్గిరిగుట్ట

వరుస కూల్చివేతలతో భయం భయం!



ప్రభుత్వ స్థలాన్ని జేసీకి చూపుతున్న సర్వేయర్ సునీత



సర్వేనం.342లో తహసీల్దార్‌తో వివరాలు అడిగి తెలుసుకుంటున్న జేసీ నర్సింహారెడ్డి

సుభాష్‌నగర్: గాజులరామారంలోని దేవేందర్‌నగర్, కైసర్‌నగర్ ప్రభుత్వ స్థలాల్లో ఇళ్లు కట్టుకున్న వారికి టెన్షన్ మొదలైంది. ఇటీవల వరుస కూల్చివేతలతో భయందోళనలతో బిక్కు బిక్కుమంటూ కాలం వెళ్లి తీస్తున్నారు. తాజాగా మేడ్చల్ జిల్లా జాయింట్ కలెక్టర్ నరసింహారెడ్డి శుక్రవారం కుత్బుల్లాపూర్ తహసీల్దార్ సంజీవరావు, రెవెన్యూ అధికారులతో కలిసి పర్యటించడంతో ఇప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. గాజులరామారంలోని దేవేందర్‌నగర్, కైసర్‌నగర్‌లలోని సర్వే నంబర్ 329/1, 342 ,307 ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను పరిశీలించారు. హెచ్‌ఎండీఏకు కేటాయించిన 53 ఎకరాల చుట్టూ జరుగుతున్న ప్రహరీ నిర్మాణ పనులను అడిగి తెలుసుకున్నారు.

ఇళ్ల పరిశీలన..

ప్రభుత్వ స్థలంలో నిర్మించుకున్న ఇళ్లను జాయింట్ కలెక్టర్ పరిశీలించారు. నేరుగా ఇళ్ల వద్దకు వెళ్లి వారి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఎన్ని గదులు నిర్మించారు, ఇళ్లలో ఎవరెవరు ఉంటున్నారు, ఖాళీ గదులు ఎన్ని ఉన్నాయి, వాటి జాబితా తయారు చేయాలని ఆదేశించారు.

భద్రత కల్పిస్తాం..

అధికారులు సేకరించిన జాబితా అనంతరం కూల్చివేతలు చేపట్టాలని సూచించారు. అందుకు తగ్గ పోలీస్ భద్రత కల్పిస్తామని తెలిపారు. ముందస్తుగా పెద్ద ఎత్తున పోలీసులను మోహరించి తదనంతరం కూల్చివేతలు చేపట్టే యోచనలో రెవెన్యూ యంత్రాంగం ఉంది.

కూల్చివేతలకు రంగం సిద్ధం..?

ప్రభుత్వ స్థలాల్లో వెలిసిన నిర్మాణాలను తొలగించేందుకు అధికారులు కసరత్తు ప్రారంభించినట్లు తెలుస్తుంది. వెలిసిన నిర్మాణాలను ఎన్ని తొలగించాలి, ఏ విధంగా తొలగించాలో ప్రణాళిక రూపొందించే పనిలో పడ్డారు. గతంలో ఒకటి రెండు ఇళ్లను తొలగిస్తే ఆందోళనలు, ఆత్మహత్యలకు దారితీసింది. మరి పదుల సంఖ్యలో వెలిసిన నిర్మాణాల కూల్చివేతలు చేపడితే అక్కడ నివాసం ఏర్పాటు చేసుకున్న స్థానికుల నుంచి ఎదురయ్యే పరిణామాలు ఏ విధంగా ఉంటాయని మరోవైపు అధికారులు సందిగ్ధంలో పడ్డారు.

రోజుల నుంచి సమావేశమై..

అధికారులు వచ్చి తమ ఇళ్లను కూల్చి వేస్తారని గుసగుసలు రావడంతో గత వారం రోజుల నుంచి ఐదు బస్తీల ప్రజలు సమావేశమవుతున్నారు. తమ ఇల్లు పోవద్దంటే ఏమి చేయాలి? ఎలా ఎదుర్కోవాలి? అనే దానిపై చర్చించుకున్నారు. తమ ఇల్లు పోనివ్వకుండా చూడాలని వారం రోజులుగా నాయకుల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వాలి

ఏఐటీయూసీ డిమాండ్

కుత్బుల్లాపూర్: పారిశుద్ధ్య కార్మికులకు వారాంతపు సెలవులు ఇవ్వకుండా వెట్టి చాకిరి చేయిస్తున్నారని మేడ్చల్ జిల్లా ఏఐటీయూసీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జయచంద్ర అన్నారు. శుక్రవారం కొంపల్లి మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమైన ఏఐటీయూసీ నాయకులు వారు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జయచంద్ర, జిల్లా అధ్యక్షుడు రాములు, కుత్బుల్లాపూర్ కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ.. కొంపల్లి మున్సిపాలిటీలో పనిచేసే పారిశుద్ధ్య సిబ్బందికి సెలవులు ఇవ్వకుండా కాంట్రాక్టర్ కార్మిక చట్టానికి వ్యతిరేకంగా వెట్టిచాకిరి చేయిస్తున్నాడని అన్నారు. తక్షణమే వారాంతపు సెలువు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేకుంటే సమ్మెకు దిగుతామని హెచ్చరించారు.

◆ అదే విధంగా కార్మికులకు సంబంధించి ఈఎస్ఐ, పీఎఫ్ సమస్యలను పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. అనంతరం వాతాంతపు సెలవుల విషయమై కొంపల్లి కమిషనర్‌కు వినతి పత్రం ఇవ్వగా ఆయన సానుకూలంగా స్పందించారు. ఈ కార్యక్రమంలో కార్మిక యూనియన్ నాయకులు నాగయ్య, పోచమ్మ, లక్ష్మి, మోహన్, సుహాసిని, లక్ష్మణ్, సూపర్‌వైజర్ కిషన్, దశరథ, కార్మికులు పాల్గొన్నారు.

కార్పొరేషన్‌లోని పెండింగ్ పనులు పూర్తి చేయాలి



నిజాంపేట్ కార్పొరేషన్ మేనేజర్‌కు వినతి పత్రం అందజేస్తున్న సీపీఐ నాయకులు

నిజాంపేట్: నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్‌లో పెండింగ్‌లో ఉన్న కమ్యూనిటీ భవనాలు, గ్రంథాలయాలు, బస్తీ దవాఖానాలు వెంటనే పూర్తి చేయాలని సీపీఐ నాయకులు శుక్రవారం మేనేజర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాచుపల్లి మండల సీపీఐ కార్యదర్శి పాలబిందెల శ్రీనివాస్ మాట్లాడుతూ... 31, 32, 33 డివిజన్లలో కమ్యూనిటీ భవనాలకు శంకుస్థాపనలు చేసి సంవత్సరం పూర్తి కావస్తున్నా పనులు ముందుకు సాగడం లేదన్నారు. ఇక బస్తీ దవాఖానాలు, గ్రంథాలయ భవన నిర్మాణాలను నత్తనడకన కొనసాగుతున్నాయని ఆరోపించారు. శనివారం జరగబోయే నిజాంపేట్ కార్పొరేషన్ కౌన్సిల్ సమావేశంలో పెండింగ్ పనులపై తీర్మానం చేసి వెంటనే పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సీపీఐ నాయకులు ఆశీ యాదయ్య, ఏఐఎస్‌ఎఫ్ కార్యదర్శి శివకుమార్ తదతరులు ఉన్నారు.

కుత్బుల్లాపూర్ అభివృద్ధికి కృషి చేస్తున్నాం

ఎమ్మెల్యే వివేకానంద్

కుత్బుల్లాపూర్: కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధికి శాయశక్తులా కృషి చేస్తున్నానని ఎమ్మెల్యే వివేకానంద్ అన్నారు. ప్రగతియాత్రలో భాగంగా శుక్రవారం ఆయన జీడిమెట్ల డివిజన్ పరిధిలోని గోదావరి హోమ్స్, ప్రశాంత్‌నగర్, వెన్నెలగడ్డ తదితర ప్రాంతాల్లో పాదయాత్ర చేపట్టి స్థానికంగా నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. త్వరలోనే వాటికి ప్రతిపాదనలు సిద్ధం చేయించి పరిష్కరించేలా చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. అదే విధంగా గోదావరి హోమ్స్‌లో రూ.69 లక్షలతో చేపడుతున్న ఎస్ఎన్‌డీపీ నాలా పనులు, రూ.40 లక్షలతో పార్కు అభివృద్ధి పనులను ఎమ్మెల్యే పరిశీలించారు. ఈ కార్యక్రమంలో స్థానిక బీఆర్ఎస్ నాయకులు, ఆయా కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులు, కాలనీల ప్రజలు పాల్గొన్నారు.

ఆయుష్మాన్ భారత్ రాష్ట్రంలో అమలు చేయడం లేదు



బీజేపీ స్ట్రీట్ కార్నర్ మీటింగ్‌లో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే శ్రీశైలంగౌడ్

నిజాంపేట్: ఆయుష్మాన్ భారత్ లాంటి కేంద్ర ప్రభుత్వ పథకాలను బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేయడం లేదని మాజీ ఎమ్మెల్యే, బీజేపీ రాష్ట్ర నాయకుడు కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. ప్రజాగోస – బీజేపీ భరోసాలో భాగంగా గురువారం రాత్రి నిజాంపేట్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరనగర్, దుండిగల్ మున్సిపల్ పరిధిలోని డీ–పోచంపల్లిలలో స్ట్రీట్ కార్నర్ మీటింగ్ నిర్వహించారు. శక్తి కేంద్రాల ఇన్‌చార్జ్‌లు రాముగౌడ్, రామచందర్‌నాయక్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీశైలంగౌడ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు.

◆ కేంద్ర ప్రభుత్వ పథకాలను రాష్ట్రంలో అమలు చేయకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం కుట్ర పన్నుతోందని ఆరోపించారు. సీఎం కేసీఆర్ ఎన్ని జిమ్మిక్కులు చేసినా తెలంగాణాలో రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని జోస్యం చెప్పారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీల నుంచి సుమారు 50 మంది కార్యకర్తలు, యువకులు శ్రీశైలంగౌడ్ సమక్షంలో బీజేపీలో చేరారు.

◆ ఈ కార్యక్రమాల్లో బీజేపీ రాష్ట్ర కార్యదర్శి కె.మాధవి, దుండిగల్ మున్సిపల్ బీజేపీ అధ్యక్షుడు మల్లేష్ యాదవ్, సుమన్‌రావు, బూత్ అధ్యక్షులు మోహన్‌రెడ్డి, సతీష్‌రెడ్డి, మహాదేవ్ బోస్లే, ప్రభాకర్, అట్లూరి రామ్‌రెడ్డి, నాయకులు కళ్యాణ్ చక్రవర్తి, నిరంజన్‌రెడ్డి, కార్యకర్తలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

కరోనా లక్షణాలు ఉంటే పరీక్షలు చేయించుకోండి

కుత్బుల్లాపూర్: జంట సర్కిళ్ల పరిధిలో కోవిడ్–19 నిర్ధారణ పరీక్షలు కొనసాగుతున్నాయి. శుక్రవారం సూరారం కాలనీ యూపీహెచ్‌సీలో 15 మందికి పరీక్షలు చేయగా అందరికి నెగిటివ్ రిపోర్టులు వచ్చినట్లు వైద్యాధికారులు తెలిపారు. జర్వం, ఒళ్లు నొప్పులు, దగ్గు, గొంతునొప్పి తదితర లక్షణాలుంటే వెంటనే కోవిడ్ పరీక్షలు చేయించుకుని జాగ్రత్త పడాలని వైద్యాధికారులు కోరుతున్నారు.

కూన అంజమ్మగౌడ్‌కు నివాళి

కుత్బుల్లాపూర్: సనత్‌నగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ సీనియర్ నేత కూన వెంకటేష్‌గౌడ్ మాతృమూర్తి కూన అంజమ్మగౌడ్ దశదినకర్మ గాజులరామారంలోని కేవీఎస్ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్, శ్రీనివాస్‌గౌడ్‌లతో పాటు మనుమలు శ్రవణ్, గౌరీశంకర్, ఎమ్మెల్యే వివేకానంద్ ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆమె గత స్మృతులను తలచుకుంటూ పాడిన పాటలు అందర్నీ కన్నీరు పెట్టించాయి.



అంజమ్మగౌడ్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న కూన వెంకటేశ్‌గౌడ్ కుటుంబసభ్యులు

వీఎన్ఆర్ వీజేఐఈటీలో 'హాల్ట్ ప్రైజ్' చాలెంజ్



నిజాంపేట్: బాచుపల్లిలోని వీఎన్ఆర్ విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (వీఎన్ఆర్ వీజేఐఈటీ) కళాశాలలో శుక్రవారం 'హాల్ట్ ప్రైజ్'చాలెంజ్ జరిగింది. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన 120 మంది విద్యార్థులు 38 జట్లుగా పోటీ పడనున్నాయి. ఈ చాలెంజ్‌కు సామాజిక కార్యకర్త, డిజైనర్ నిహారికా రెడ్డి, హాట్‌నాట్ అంకురసంస్థ వ్యవస్థాపకుడు ఫ్రెడెరిక్ దేవరంపాటి, క్లెమైట్ రియాల్టీ ప్రాజెక్ట్స్ ప్రతినిధి అంతరాచౌదరి, వీఎన్ఆర్ వీజేఐఈటీ ఇన్నోవేషన్ కౌన్సిలర్ కన్వీనర్ డాక్టర్ కిరణ్ చక్రవర్తుల విజేతనిర్ణేతలగా వ్యవహరించనున్నారు.

◆ రీడిజైనింగ్ ఫ్యాషన్ ఇన్ ఏ సస్టైనబుల్ వే ఇతివృత్తంగా ఈ చాలెంజ్ జరుగనుంది. ఈ చాలెంజ్‌లో మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లను ముంబాయిలో జరిగే మధ్య, దక్షిణాసియా ప్రాంతీయ స్థాయి పోటీలకు పంపుతామని సమన్వయకర్తలు డాక్టర్ వెంకటేశ్వరరావు, చేకూరి శ్రీసుమంత్ తెలిపారు.

◆ సమాజహితాన్ని, పర్యావరణ హితాన్ని దృష్టిలో పెట్టుకుని పరిష్కారాలు రూపొందించటమే లక్ష్యంగా ఈ చాలెంజ్‌ను రూపకల్పన చేశామని ప్రిన్సిపాల్ డాక్టర్ సీడీ నాయుడు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే విద్యార్థులు ఎవరైనా అంకుర సంస్థగా తీర్చిదిద్దాలనుకుంటే తమ ఇంక్యుబేటర్ 'విజేహబ్'ద్వారా సహకారాన్ని అందిస్తామని సంచాలకులు డాక్టర్ బి.చెన్నకేశవరావు తెలిపారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి సమన్వయకర్త, హాల్ట్ ప్రైజ్ కూటమి క్యాంపస్ డైరెక్టర్, బెజుగం రిషబ్‌గుప్తా, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

పనులు నాసిరకం.. కొన్నిరోజులకే శిథిలం



గాంధీనగర్ మెయిన్ రోడ్డులో మారుతినగర్ వద్ద..

రంగారెడ్డినగర్: ప్రధాన రోడ్ల వెంబడి ఉన్న భూగర్భ డ్రైనేజీ మ్యాన్‌హోళ్ల పనులు నాసిరకంగా చేపట్టడంతో కొద్ది రోజులకే శిథిలావస్థకు చేరుతున్నాయి. కొన్ని చోట్ల మూతలకు పగుళ్లు, మరి కొన్ని చోట్ల భూమిలోకి దిగబడటంతో వాహనదారులు, పాదచారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. రంగారెడ్డినగర్ డివిజన్ పరిధిలోని పలు చోట్ల మ్యాన్‌హోళ్ల నిర్వహణ లోపించడంతో ప్రమాదాలకు నిలయాలుగా మారుతున్నాయి.. జీహెచ్ఎంసీ నుంచి జలమండలి భూగర్భ డ్రైనేజీల నిర్వహణను బదిలీ చేసినా సంబంధిత అధికారులు అది తమ పరిధిలోకి రాదన్నట్లుగా వ్యవహరిస్తుండటం విమర్శలకు తావిస్తోంది.

◆ గాంధీనగర్ ప్రధాన రోడ్డులోని మారుతీనగర్ వద్ద ఓ మ్యాన్‌హోల్‌కు సరిగ్గా మరమ్మతులు చేపట్టకుండానే పైపైనే మూతను ఏర్పాటు చేసి చేతులు దులుపుకున్నారు. దీంతో మూత రోడ్డుపైకి రావడంతో అటుగా రాకపోకలు సాగించే వాహనదారులకు ప్రమాదం పొంచి ఉంది.



గురుమూర్తినగర్ నుంచి గిరినగర్‌కు వెళ్లే ప్రధాన రహదారిలో మ్యాన్‌హోల్ కృంగిపోయింది. నెల రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. ఈ విషయమై స్థానికులు పలుమార్లు జలమండలి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదని వాపోతున్నారు. దీంతో రాత్రిళ్లు ద్విచక్ర వాహనాలు శిథిలమైన మ్యాన్‌హోల్‌లో ఇరుక్కుని గాయాల పాలైన ఘటనలు అనేక మున్నాయి.



నెహ్రూనగర్ నుంచి జగద్గిరిగుట్టకు వెళ్లే ప్రధాన రోడ్డుకు ఆనుకుని ఓ గల్లీ ముఖద్వారంలో ఉన్న మ్యాన్‌హోల్ నిర్మాణాన్ని నాసిరకంగా చేపట్టడంతో అది ఓ వైపు ఒరిగి భూమిపైకి తేలింది. దీంతో వ్యర్థాలు జామైన ప్రతిసారి అందులోంచి మురుగు రోడ్లపైకి పారుతోందని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ప్రజా సంక్షేమమే పరమావధిగా పని చేస్తున్నాం

శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: ప్రజా సంక్షేమమే పరమావధిగా బీఆర్ఎస్ ప్రభుత్వం పని చేస్తోందని శాసనమండలి విప్, ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. శుక్రవారం శంభీపూర్‌లోని కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలు కాలనీల ప్రజలు, ప్రజా ప్రతినిధులు ఎమ్మెల్సీని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా స్థానికంగా నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని ఆయనను కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన సంబంధిత అధికారులతో ఫోన్లలో మాట్లాడారు.

◆ గాజులరామారం డివిజన్ కైసర్‌నగర్‌కు చెందిన పోచమ్మ, ఎల్లమ్మ ఆలయ నూతన కమిటీ సభ్యులు అధ్యక్షుడు మద్దెల సాయిబాబా ఆధ్వర్యంలో ఎమ్మెల్సీని కలిసి సత్కరించారు. ఆలయాభివృద్ధికి సహకరించాలన్నారు. కైసర్‌నగర్‌లో రోడ్ల ఏర్పాటుకు చొరవ చూపాలని కోరడంతో సానుకూలంగా స్పందించారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బాలకృష్ణ, సత్యనారాయణ, రాములు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

◆ సుభాష్‌నగర్‌లోని ఫాక్స్ సాగర్ వద్ద ఒడిషా జగన్నాథ్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ×యజ్ఞ జియా ఆహుతి నిత్య హరినామ సంకీర్తన కార్యక్రమానికి ప్రభుత్వ విప్ శంభీపూర్‌రాజు, కార్పొరేటర్ హేమలత సురేష్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరై జగన్నాథ్ స్వామి దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శంభీపూర్ రాజు మాట్లాడుతూ.. బీఆర్ఎస్ ప్రభుత్వం దేశంలోని అన్ని రాష్ట్రల ప్రజల అభ్యున్నతికి కృషి చేస్తోందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ డివిజన్ అధ్యక్షుడు శ్రీకాంత్, ప్రధాన కార్యదర్శి శివాజీ, పద్మావతి, లక్ష్మి, శేషు, శేఖర్, పద్మజరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

◆ దుండిగల్ మున్సిపల్ పరిధి మల్లంపేట్‌లోని హైరైజ్ కాలనీవాసులు ఎమ్మెల్సీని కలిసి తమ ప్రాంతంలో మౌలిక వసతులు కల్పించాలని వినతి పత్రం అందజేశారు.



ప్రభుత్వ విప్ శంభీపూర్ రాజును కలిసిన హైరైజ్ కాలనీవాసులు



శంభీపూర్ రాజును సత్కరిస్తున్న కైసర్‌నగర్‌కు చెందిన ఎల్లమ్మ, పోచమ్మ ఆలయ కమిటీ సభ్యులు